క్లుప్తంగా

తుంగభద్ర జలాలకు పూజలు



పెన్నహోబిలంలో తుంగభద్ర జలాలకు పూజలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ దిగువ భాగంలో ఉన్న కాలువకు తుంగభద్ర జలాలు రావడంతో మంగళవారం ఆలయ ప్రధాన అధికారి కె. విజయ్‌కుమార్, ప్రధాన అర్చకుడు ద్వారకానాథాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది రైతులకు మంచి జరగాలని, తుంగభద్ర జలాల్లో స్నానం ఆచరించే భక్తులకు ఎలాంటి ఆపద కలగకుండా కాపాడాలని గంగను వేడుకున్నారు.

యువతతోనే దేశాభివృద్ధి



దేశ రక్షణలో సైనికుల పాత్ర గురించి వివరిస్తున్న దృశ్యం

కూడేరు: యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథూర్ పిలుపునిచ్చారు.. మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో సీఏటీసీ-4వ ఎన్‌సీసీ శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. మంగళవారం క్యాడెట్లకు నాయకత్వ లక్షణాలు, సమాజ సేవ, సేవా గుణం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదానికి గురైన వారిని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి ముందుండాలని క్యాడెట్లకు సూచించారు. కార్యక్రమంలో నంద్యాల, కర్నూలు, అనంతపురం, సత్యసాయి జిల్లాలకు చెందిన 417 మంది క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

సజావుగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ మారుతమ్మ

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మారుతమ్మ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ బొమ్మన్న, వైస్ ఎంపీపీ లక్ష్మీ కాంతమ్మ, డీటీ నాగరాజు ఎంపీడీఓ సాలమాన్, ఎంఈఓ విజయకుమారి, ఈఓఆర్‌డీ బాలాజీ హాజరయ్యారు. ఎంపీపీ, ఎంపీడీఓ మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన నిధుల ద్వారా చేపట్టిన పనులు పూర్తి కావస్తున్నాయన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ ‘నాడు-నేడు’ ద్వారా కళ్యాణదుర్గంలో సుమారుగా 82 పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏడీ ఎల్లప్ప, హార్టికల్చర్ అధికారి కృష్ణతేజ, ముద్దినాయనపల్లి పీహెచ్ డాక్టర్ విజయేంద్ర, ఏపీఓ ఒబిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు వెంకటేశులు, గోళ్ల బొజ్జన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రోగులకు పరీక్షలు

కణేకల్లు: మండలంలోని యర్రగుంట పీహెచ్‌సీలో మంగళవారం కుష్టు రోగులకు డాక్టర్లు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వీరిలో ఆరుగురిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశామని పీహెచ్‌సీ డాక్టర్ రమేష్ నాయక్ తెలిపారు. ఈ నెల 16న పలమనేరులో ఆస్పత్రిలో ఎంపికైన వారికి శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ నీలకంఠ, పలమనేరు ఆస్పత్రి ఫిజియోథెరపిస్ట్ బాషా, ఎంపీహెచ్‌ఓ తిరుపాల్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల వెరిఫికేషన్



మాట్లాడుతున్న ఆర్డీఓ నిశాంత్ రెడ్డి

కళ్యాణదుర్గం: ఓటర్ల వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ నిశాంత్ రెడ్డి సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా వెరిఫికేషన్ పక్కాగా చేపడుతున్నామన్నారు. బూత్‌ల వారీగా ఆయా గ్రామాలలో బీఎల్ఓ, బీఎల్‌ఏలను ఇంటింటికీ పంపి ఓటరు జాబితాను పరిశీలిస్తున్నామన్నారు. బీఎల్ఓలతో పాటు వలంటీర్లు ఎక్కడైనా వెరిఫికేషన్‌లో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీలు వెంకటేశులు, శ్రీనివాసులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు గోపారం శ్రీనివాసులు, సుధీర్, నారాయణ, నగేష్, రాంభూపాల్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- బీఎల్‌ఏల సమీక్షలో మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్

కళ్యాణదుర్గం: వచ్చే ఎన్నికల్లో స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారు చేయడానికి బీఎల్‌ఏలు పారదర్శకంగా పనిచేయాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని కళ్యాణదుర్గం రూరల్, అర్బన్ మండలాలు, కంబదూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం, శెట్టూరు మండలాల ప్రజా ప్రతినిధులు, బీఎల్‌ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బూత్‌ల వారీగా స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి అందరూ కృషి చేయాలన్నారు. దొంగ ఓట్లను గుర్తించి బీఎల్‌ఓలకు తెలియజేయాలన్నారు. డబుల్ ఎంట్రీ, అడ్రస్ లేనివి, బయటి వ్యక్తుల వివరాలను సేకరించాలన్నారు. ముఖ్యంగా ఎక్కడైనా ఒకేసారి పదుల సంఖ్యలో కొత్త ఓటర్లు చేర్చినా, తొలగించినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ ఎలాగైనా ఈసారి అధికారంలోకి వచ్చేందుకు కుయుక్తులు పన్నుతుందన్నారు. ఓటరు జాబితాల్లో దొంగ ఓట్లను చేర్చేందుకు ప్రత్యేక విభాగం పనిచేస్తుందన్నారు. వీటన్నింటినీ ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏలు జాగ్రత్తతో పరిశీలించాలన్నారు అనంతరం వెరిఫికేషన్‌లో తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను మంత్రి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, జెడ్పీటీసీ బొమ్మన్న, ఎంపీపీలు మారుతమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, జానపద, నృత్య అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, జేసీఎస్ కన్వీనర్లు అర్చన, పెరుగు తిమ్మరాజు, గంగాధర్, ఆంజనేయులు, నాయకులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

అవినీతిలో ‘కాలవ’ ఆరితేరాడు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు అవినీతిలో ఆరితేరాడని, మంత్రి పదవిని అడ్డు పెట్టుకుని అప్పట్లో రూ.వందల కోట్లు కొల్లగొట్టాడని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. ఒక్క ఇసుకలోనే సుమారు రూ.360 కోట్ల దోపిడీ చేశాడని ధ్వజమెత్తారు. ఈ మాటను తామేదో కల్పించుకుని అనడం లేదన్నారు. ఆయన మానసపుత్రికగా చెప్పుకునే ఈనాడులోనే ఆనాడు ‘మంత్రి ఇలాకాలో కంత్రీల కులాసా’ అంటూ పెద్ద అక్షరాలతో అచ్చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అవినీతి, అక్రమాల గుర్తించి కాలవ మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లిన ట్టుందన్నారు. బీటీ ప్రాజెక్టు, ఉంతకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు నీరివ్వడం, కణేకల్లు చెరువు తో పాటు వేదావతి నదిలో సబ్‌సర్ఫేస్ డ్యాంలో పూడిక తీయడం, ఇసుక దిబ్బల్లో ఎడారి నివారణ, రెయిన్ గన్లతో నీటితడులు, నీరు-చెట్టు, ఆఖరుకు ఇంటింటికీ నిర్మించే మరుగుదొడ్లలోనూ రూ.కోట్లు దోపిడీ జరిగింది వాస్తవం కాదా అంటూ ప్రశ్నించారు. ప్రాజెక్టుల పేరుతో నీవు తెచ్చిన జీఓలన్నీ ఉత్తుత్త వేనని కొట్టిపడేశాడు. కాలవ హామీలన్నీ పేపర్‌మీద తప్పా ఆచరణలో ఎక్కడా సాధ్యం కాలేదన్నారు. రాష్ట్రంలో దిగజారుడు రాజకీయాలకు కేరాఫ్ కాలవ రాష్ట్రంలో దిగజారుడు రాజకీయాలకు కేరాఫ్ కాలవ మాత్రమే విరుచుపడ్డారు. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచిన రాయదుర్గంలోనూ స్వార్థ రాజకీయాల కోసం ప్రాంతాలు, కులాలమధ్య చిచ్చు పెట్టేలా ప్రేరేపిస్తున్నాడన్నారు. టీడీపీ అంటేనే ప్రజల్లో తెలుగుదొంగల పార్టీగా మారిపోయిందన్నారు. అధికారంలో ఉన్నన్నాళ్లూ ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి దోపిడీ, దౌర్జన్యం, అక్రమాలకే కాలవ పెద్దపీట వేశాడన్నారు. ప్రజలపై అభిమానం, విశ్వాసం ఉన్నవాడైతే అధికారాలన్నీ చేతిలో ఉన్నా ప్రాజెక్టులు ఎందుకు కట్టలేదు..? సాగు, తాగునీటి కష్టాలు తీర్చడంలో ఎందుకు విఫలమయ్యావ్..? గృహ నిర్మాణశాఖ మంత్రిగా ఉంటూ అర్హులకు ఇళ్లెందుకు కట్టించలేక పోయావో చెప్పాలంటూ నిలదీశారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో నీవు, నీ జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలు, మోసాలు, దారుణాలను ప్రజలెలా మరిచిపోతారంటూ హెచ్చరించారు. వేదావతి హగరిలో బోర్లు తొలగించి, శ్మశానాలను సైతం లెక్కచేయకుండా, తవ్విన ఇసుక గోతులు నేటికీ ప్రజలను వెక్కిరిస్తున్నాయన్నారు. మీ అధినేత చంద్రబాబు ను ఇటీవల ఎవరో ఏదో అన్నారనే అక్కసుతో వెక్కి వెక్కి ఏడ్చాడని, ఇంతకీ ఆ విషయం ఏంటో ప్రజలకు నేటికీ అర్థం కాలేదన్నారు. కాలవ లోగుట్టు విప్పితే అంతకంటే ఎక్కువే ఏడ్వాల్సి వస్తోందనే విషయం ప్రజల్లో చర్చసాగుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమం వరదై ప్రవహిస్తుంటే టీడీపీ నాయకులు చూసి ఓర్వలేక పోతున్నాడని మండిపడ్డారు. ఈ తెలుగు దొంగలందరికీ వచ్చే ఎన్నికలే ఆఖరివి కాబోతున్నాయని జోష్యం చెప్పారు. 2024 ఎన్నికల్లో 175 కు 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

జగన్‌తోనే ముస్లిం మైనారిటీల అభ్యున్నతి



మత పెద్దలతో కలసి హర్‌దిల్‌మే వైఎస్సార్ పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాష్ట్రంలో మైనారిటీల అభ్యున్నతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ముస్లింలకు పెద్దపీట వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచినట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి గోల్డ్ ఇస్మాయిల్ అన్నారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ‘హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాథ్’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారు కౌన్సిలర్లు ఫక్రుద్దీన్, షబ్బీర్, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ బషీర్ అహ్మద్, అబ్బాస్ తదితరులు పట్టణంలోని జామియా మొహమ్మదీయ అహ్లేఅదిస్, అక్సా మసీదులను సందర్శించి మతపెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనారిటీలకు అందుతున్న ఆర్థిక, సామాజిక, సంక్షేమ అభివృద్ధిని వివరించారు. అలాగే మసీదులో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు వైస్ చైర్మన్ వలిబాషా, గోల్డ్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సీఎం వైఎస్‌జగన్ సంక్షేమ పాలనలో ప్రతి మైనారిటీ కుటుంబానికి మేలు జరుగుతోందన్నారు. ముస్లిం మైనారిటీలు ప్రభుత్వానికి అండగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు అబ్దుల్ రజాక్, అబ్దుల్‌మాజిద్, అబ్దుల్ హాఫీమ్, ఇమామ్ నజీర్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కళ్యాణదుర్గం: మండలంలోని మల్లాపురం గ్రామంలో అంగన్‌వాడీ 1, 2 కేంద్రాలను సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ ద్వారా లబ్ధిదారులకు అందుతున్న టీహెచ్‌ఆర్‌పై అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇంటికే పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు.

కాలవా.. సెల్ఫీ డబ్బాలు చాలించు



మాట్లాడుతున్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి

రాయదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని కూడా మీ హయాంలో జరిగినట్లు చెప్పుకునే కాలవా .... ఇక సెల్ఫీ డబ్బాలు చాలించు అని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి , సచివాలయాల మండల కన్వీనర్ మురహరి, రేకులకుంట శివారెడ్డి విమర్శించారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని మలకాపురం వద్ద వేదావతి నదిలో మా హయాంలో సబ్ సర్ఫేస్ డ్యాం నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్న కాలవ ..ఆ డ్యాం నిర్మాణంలో కమిషన్లు దండుకోవడంతో పాటు , సర్ఫేస్ డ్యాం నిర్మాణం పేరుతో ఇసుక దొంగలించిన మీరా .... నీతులు చెప్పేది అని మండిపడ్డారు. వేదావతి నది, చిన్న హగరి నదుల్లో ఇసుక తరలింపు ద్వారా రూ.360 కోట్లు దోచుకున్నట్లు మీ ఆస్థాన పత్రికగా చెప్పుకుంటున్న మీ పచ్చ పత్రికలోనే మంత్రి ఇలాఖాలో కంత్రీల కులాసా... అనే వార్తను మరిచిపోయారా.. అంటూ దెప్పి పొడిచారు. అలాగే నీరు చెట్టులో దోపిడీ, మట్టి దోపిడీ , చెరువుల్లో పూడిక తీత పేరుతో కోట్లకు కోట్లు దోచుకున్న దొంగలే .... నేడు నీతులు వల్లిస్తే ప్రజలు నమ్ముతారనుకోవడం మీ భ్రమ అన్నారు. ప్రజలను వంచించడం, మభ్యపెట్టడం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో మీకు మరోసారి ప్రజలే తగిన శాస్తి చేయడం తథ్యమని హెచ్చరించారు. కార్యక్రమంలో బోర్‌వెల్ నాగిరెడ్డి, ఎంపీటీసీలు సురేష్, అరుణ్‌కుమార్, శివప్ప, సర్పంచ్ విశ్వనాథ్ రెడ్డి, కెంచానపల్లి బుజ్జి, హరిశ్చంద్ర నాయక్, ముక్కణ్ణ, మెచ్చిరి చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామన్న, జుంజురాంపల్లి హనుమంత రాయుడు, మఠం నగేష్, కొల్లన్న, మల్కాపురం నాగరాజు, ఆంజనేయులు, అయ్యప్ప, పవన్, వైజాగ్ రవికుమార్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన



విడపనకల్లు: సంక్షేమ పథకాల బుక్ లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



ఉరవకొండ: నూతన పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

విడపనకల్లు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎస్సీ, బీసీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో కేవలం తెలుగు తమ్ముళ్లు మాత్రమే లబ్ధి పొందారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు కొనసాగులంటే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, పార్టీ మండల కన్వీనర్ బసన్న, ఉరవకొండ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సుశీమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గిరిబాబు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గోపాలకృష్ణ, జెడ్పీ మాజీ సభ్యుడు సింగాడి తిప్పయ్య, మాజీ సర్పంచు దేశాయ్ చంద్రనాథ్, సచివాలయ కన్వీనర్లు దేశాయ్ సిద్ధార్థ, దేశాయ్ మున్నా, సర్పంచు మోదుపల్లి రామాంజనేయులు, ఉలిగన్న, నాగరాజు, యువరాజు, పెద్ద భీమలింగ, బెస్త ఎర్రిస్వామి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన ఓ బూటకం

ప్రాజెక్టుల పేరుతో ప్రతి పక్షనేత చంద్రబాబు చేపట్టిన పర్యటన ఒక బూటకమని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ పెరుగుతుంటే చంద్రబాబు ఓర్వలేక పోతున్నారన్నారు. ఇక టీడీపీని ప్రజల నమ్మే పరిస్థితి లేదని తెలిసి కిరాయి గుండాలతో రాష్ట్రంలో అల్లర్లకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి తప్పుదోవ పట్టించాలని స్కెచ్ వేశాడన్నారు.

పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ

గుంతకల్లు బ్రాంచి మెయిన్ కెనాల్ నుంచి సత్యసాయి సమ్మర్ స్టోర్ ట్యాంకు వరకూ తాగునీటి పంపింగ్ పైపులైను నిర్మాణం కోసం మాజీ ఎమ్మెల్యే మంగళవారం భూమి పూజ చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన నిధులు రూ.15 లక్షలతో నూతనంగా తాగునీటి పంపింగ్ లైన్ నిర్మాణం చేపడుతున్నట్లు ఏఈ ధనుంజయ తెలిపారు. బీబీసీ కెనాల్ నుంచి నేరుగా సత్యసాయి సమ్మర్ స్టోర్ ట్యాంకు వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్స్‌లోకి పంపింగ్ చేసే విధంగా నూతన పైపులైన్ ఏర్పాటు చేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు భూమి పూజ

ఉరవకొండ: స్థానిక అనంతపురం బైపాస్ వద్ద కేకే పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న ముస్లిం మదరసా వరకూ మండల ప్రజాపరిషత్ నిధులతో ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకు మంగళవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కోఆప్షన్ సభ్యులు పామిడి సలీంకు కేటాయించిన రూ.1.20 లక్షల నిధుల ద్వారా పైప్‌లైన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎంపీపీ చందాచంద్రమ్మ, కోఆప్షన్ సభ్యులు పామిడిసలీంలు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా తాగునీరు అందక మదరసా పిల్లలు ఎన్నో అవస్థలు పడేవారన్నారు. సమస్యను మాజీ ఎమ్మెల్యే విశ్వ దృష్టికి తీసుకెళ్లగానే పైప్‌లైన్ మంజురు చేయించారన్నారు. జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, పట్టణ రెండో ప్రభుత్వ ఖాజీ పామిడి అజీమ్, ఉరవకొండ పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, మదరసా నిర్వాహకులు బేల్దార్ జిలాన్, జేసీఎస్ కన్వీనర్ ఆసిఫ్, మోమిన్ జిలాన్, ఫొటోప్రేమ్ ఖాదర్, వన్నూర్‌సాబ్, ఈడిగ ప్రసాద్, పట్టణ నాయకులు అన్వర్, తాజు, పామిడి నిజాం, జిలాన్, అబ్దుల్ హాజీకరీం, బళ్లారి మహబూబ్ పీరా పాల్గొన్నారు.

దొంగ ఓట్లను తొలగించండి

ఉరవకొండ: నియోజకవర్గంలో టీడీపీ మద్దతుదారుల దొంగ ఓట్లను గుర్తించి తొలగించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బసవరాజు, నరసింహులు డిమాండ్ చేశారు. మంళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ శంకరయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. రిటర్నింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నియోజకవర్గంలో చురుగ్గా సాగుతోందని, బీఎల్ఓలకు అన్నీ రాజకీయపార్టీలు సహకరించాలన్నారు. ఉరవకొండ రూరల్ సీఐ శేఖర్, అర్బన్ హరినాథ్‌లు పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఐదు మండలాల తహసీల్దార్లు హరిప్రసాద్, ఈరమ్మ, అనిల్‌కుమార్, శేషారెడ్డి, బాలాజీ, ఈడీటీ మునీంద్ర, ఎన్నికల సీనియర్ సహాయకులు వంశీకృష్ణ పాల్గొన్నారు.

స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత ‘కేసీజీహెచ్’

కళ్యాణదుర్గం: ఆర్డీటీ ఆధ్వర్యంలో స్థానిక కరణం చిక్కప్ప హైస్కూల్ క్రీడా మైదానంలో జరుగుతున్న స్కూల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాల జట్టు నిలిచింది. మంగళవారం క్రీడా పోటీల్లో భాగంగా 9 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో గోల్డెన్ బెల్స్ జట్టుపై కేసీజీహెచ్ జట్టు విజయం సాధించింది. ఆర్డీటీ రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు, కేసీజీహెచ్ పీడీ రమేష్, గోల్డెన్ బెల్స్ పీఈటీలు తిప్పేస్వామి, ప్రవీణ్, కళ్యాణదుర్గం క్రికెట్ కోచ్ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం, విప్‌ను విమర్శించే స్థాయి కాదు..

రాయదుర్గం: టీడీపీ మాజీ కౌన్సిలర్ బండి భారతి బరితెగించి మాట్లాడటం మానుకోవాలని, లేదంటే కౌన్సిలర్‌గా ఉండే సమయాన చేసిన అక్రమాలు, అవినీతి పై నోరు విప్పాల్సి వస్తుందని మహిళా కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, నాగవేణి, తషీరాభి, గజాల, గోరంట్ల ఉష, పార్టీ నాయకురాలు వైజాక్ రిబ్కా, మెప్మా టీఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ పార్వతి హెచ్చరించారు. మంగళవారం స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి మీ నాయకుడు కాలవ శ్రీనివాసులు తట్టుకోలేక పోతున్నాడన్నారు. ఆయన డైరెక్షన్‌లో తమ నాయకుడిపై ఇష్టారాజ్యంగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్, విప్ కాపుపై వ్యక్తిగత దూషణలు మానుకోవాలని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

నేడు ‘గడప గడపకూ మన ప్రభుత్వం’

కణేకల్లు: మండలంలోని పెనకలపాడు గ్రామంలో బుధవారం ఉదయం 6 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి మంగళవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కావాలన్నారు.

బొమ్మనహాళ్: మండలంలోని విరుపాపల్లి సచివాలయ పరిధిలో మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 9.00 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు సర్పంచ్ ఉమాపతి, ఎంపీటీసీ సురేష్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

పెన్నహోబిలంలో వేలం

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ పర్యవేక్షణాధికారి, గూగూడు ఆలయ అధికారి ఎస్. శోభ, ఈఓ కె. విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో టెంకాయ చిప్పల హక్కు పొందడానికి వేలం నిర్వహించారు. కోనాపురం గ్రామానికి చెందిన మల్లికార్జున రూ. 6.25 లక్షలకు వేలంను దక్కించుకున్నాడు.

మండల సమావేశం రేపు

గుమ్మఘట్ట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ భవాని అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి మంగళవారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యుడు, కో ఆప్షన్ సభ్యుడు, మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

విరాళం అందజేత

కళ్యాణదుర్గం: విశ్రాంత ఉద్యోగుల భవనంలో మౌలిక వసతులకు రిటైర్డ్ మెకానిక్ కేసీ తిమ్మన్న రూ.10 వేలు విరాళం అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తిప్పేస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ

శెట్టూరు: విద్యార్థులకు ‘వైఎస్సార్ కంటి వెలుగు’ ద్వారా కళ్లద్దాలు పంపిణీ చేశారు. మంగళవారం మండలంలోని శెట్టూరు ఉన్నత పాఠశాల, కేజీబీవీ, యాటకల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులకు డాక్టర్ వెంకటరమణ కళ్లజోడులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఫిరోజ్‌ఖాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మహిళా సంఘాలకు శిక్షణ తరగతులు

వజ్రకరూరు: మండల కేంద్రంలోని చంద్రోదయ మండల సమాఖ్యకార్యాలయంలో ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ పాలసీ, ఇట్స్ ఇంప్లిమెంటేషన్‌పై మంగళవారం మహిళా సంఘ సభ్యులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు వైకేపీ ఏపీఎం గుణశ్యాం మాట్లాడుతూ ప్రతి సంఘంలో లావాదేవీల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కోఆర్డినేటర్ సత్యనారాయణ, సీసీలు రామాంజనేయులు, ఓబుళేసు, రామానంద్, గ్రామ సంఘాల అధ్యక్షులు, వీఓ లీడర్లు, ఆనిమేటర్లు పాల్గొన్నారు.

నేడు నీటి పంపింగ్

రాయదుర్గంటౌన్: పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే డాక్టర్ వైఎస్సార్ హెచ్చెల్సీ శాశ్వత తాగునీటి పథకం సంబంధించి కణేకల్లులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు బుధవారం కెనాల్ నుంచి నీటి పంపింగ్‌ను ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డితోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కౌన్సిల్ సభ్యులు హాజరై ప్రారంభించనున్నట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు గంగపూజ నిర్వహించి నీటి పంపింగ్‌ను విప్ ప్రారంభిస్తారని, అలాగే టీ.వీరాపురం పంప్‌హౌస్‌లో కొత్త మోటార్లను ప్రారంభిస్తారన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొనాలి



జీడిపల్లి రిజర్వాయర్ వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు సద్దుమణిగి శాంతి పునరుద్ధరణ జరగాలంటూ రాష్ట్ర ఉత్తమ సామాజిక అవార్డు గ్రహీత చల్లా కిషోర్, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య గౌరవాధ్యక్షుడు చల్లా రాజశేఖర్ చౌదరి జీడిపల్లి రిజర్వాయర్ వద్ద, గ్రామంలోనూ ర్యాలీ నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు రాజేష్, స్వరూప్, జకర్య, జాన్‌పాల్, రవి, సెలీన చౌదరి, ప్రెస్కిల్లా, నివేదిత తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సీఐ యుగంధర్ మంగళవారం తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఐ శివను ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో నేరాలు అదుపు చేసేందుకు నిఘా ఉంచామన్నారు.

జనరిక్ మెడికల్ షాపు ఏర్పాటుకు అనుమతి

వజ్రకరూరు: మండల కేంద్రంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సహకార జనరిక్ ఔషధ మెడికల్ షాపు ఏర్పాటుకు ఉన్నతాధికా రుల ను ంచి అనుమతులు మంజూరైనట్లు పీఏసీఎస్ చైర్మన్ సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఏడీసీసీ కార్యాల యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు తక్కువ ధరకు మందులను అందుబాటులో ఉంచడంతో పాటు ఆదాయ వనరులు పెంపొందించుకోవడమే లక్ష్యంగా మెడికల్ షాపులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

బొమ్మనహాళ్: ఉద్దేహాళ్ గ్రామంలోని క్యాంపు కాలనీలో ఇంటి స్థలం రస్తా విషయంలో ఇరువర్గాలు సోమవారం రాత్రి గొడవ పడ్డారు. 2002లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చి స్థలం మంజూరు చేసిందని బాధితురాలు కృష్ణవేణి తెలిపారు. శ్మశానం పక్కన స్థలం ఇవ్వడంతో అప్పట్లో ఎవరూ ఇల్లు నిర్మించుకోలేదని, ఇటీవల అక్కడ ఇళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు మట్టి తరలిస్తుండడంతో దారి వదలకుండా పృథ్వీకుమారి, బుజ్జమ్మ, సునీలు వచ్చి దాడి చేశారన్నారు. ఈ విషయంపై ఎస్ఐ శివను వివరణ కోరగా ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు అందాయని, విచారణ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

కణేకల్లు: కణేకల్లు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆర్డీటీ నిర్వహించిన రూరల్ బాలికల అథెటిక్స్ ఆటల పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. 100 మీటర్లు, 200, 400 మీటర్ల పరుగు పందెంతోపాటు 4 X100 రిలే, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లోని ఏడు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినీలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఈనెల 28, 29వ తేదీల్లో జిల్లా కేంద్రంలో జరుగనున్న జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు ఆర్డీటీ ఏటీఎల్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు రమేష్‌రెడ్డి, భోగేష్, సరిత, రియాజ్, ఆర్డీటీ సిబ్బంది బాలక్రిష్ణ, శాంతమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిన్న మొహర్రం

రాయదుర్గంటౌన్/కూడేరు: చిన్న మొహర్రం(కొడీపీర్లు) వేడుకలు రాయదుర్గం పట్టణంలో వైభవంగా ముగిశాయి. చివరి రోజు మంగళవారం సాయంత్రం పీర్ల ఊరేగింపు, జలధి కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అంతకుముందు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని చావిడిల్లో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక ఫాతేహా పటించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే కూడేరు మండలంలోని కరుట్లపల్లిలో మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు జలధి కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.